ఓం|శ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా! వెతుకుచున్నాను నేను. వెతుకుచునే ఉన్నాను. వెతుకుచుంటి నాడు, నేడు నిజమానవ ధర్మపరుని.

అంధకారంబెల్ల హతమారునేచూడ
        వసుధలో దీపంపు వార్త వలన
ఆకొన్న వారికి ఆకలి తీరునే
        పంచభక్ష్యపు పేర్లు పరగ విన్న
నిరుపేదవాని పేదరికంబు పోవునే
        విత్త ప్రభావంబు విన్నయంత
రోగపీడితుని బల్ రోగాలు పోవునా
        ఔషధ మహిమము అంతవిన్న
శాస్త్రజాలంబునంతయు చదివినంత
దట్టమైనట్టి అజ్ఞాన తమము తెగున
ఆచరణలేని విద్యలు అవనియందు
దండి నేర్చిన ఫలమేమి? గుండుసున్న.

ప్రేమస్వరూపులారా! ప్రతి ఒక్కటికూడను ఇతరులకు బోధించేముందు స్వయంగా ఆచరణలోపెట్టి అనుభవించాలి. అనుభవించి, ఆనందించి అందించటం అత్యవసరం. ఋత్విక్కులందరుకూడను చాలా మంచివారు. నాకు నచ్చిన ఋత్విక్కులు చిక్కారు. మీరు ఈ పది దినములు చేసిన సాధన, యజ్ఞము చాలా సంతృప్తికరంగా ఉన్నవి. ఆశించినదానికంటె అధికంగానే చేస్తూ వచ్చారు. ఇలాంటి ఋత్విక్కులు చిక్కటం చాలా అదృష్టం. రేపటి దినము ఈ యజ్ఞము పరిసమాప్తమవుతున్నది. యజ్ఞము సమాప్తమవుతుందిగాని, మంత్రములు సమాప్తం కావు. మంత్రము శాశ్వతంగానే ఉంటుంది. అది గుణములతో కూడినది కాదు. 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్యశుద్ధబుద్ధముక్తనిర్మల స్వరూపిణం'. ఇట్టి మంత్రములు నిరంతరముకూడను మన చెవులలో వినిపిస్తూనే ఉంటాయి. మంత్రముతో కూడినవాడే ఋత్విక్కు. ఋత్విక్కు వేరు మంత్రము వేరు కాదు. మంత్రమే లేకపోతే తాను ఋత్విక్కు కాదు. ఈ మంత్రములు చాలా అదృష్టవంతులకు మాత్రమే ప్రాప్తిస్తాయి. లోకములో ఎంతమంది లేరు! అంతమందిలో 130మంది మాత్రమే ఈ యజ్ఞములో ఋత్విక్కులుగా పాల్గొనగలిగారు. మీరు ఎంత అదృష్టవంతులు! 'శాస్త్రంబునెప్పుడు సత్యంబుగానెంచు వేదసమ్మతులైన విప్రులారా!' విప్రులు శాస్త్రాలను నమ్మినవారు. ఇటువంటి ఋత్విక్కులు మరెక్కడైనా చిక్కుతారా? చిక్కుతారు. కాని, అందరిలో అంతో యింతో భేదముంటున్నాది. ప్రమాణ పూర్వకంగా చెప్పాలంటే, మీరు చెప్పే ప్రతి మంత్రముకూడా సుస్పష్టంగా ఉంటున్నది. ఇట్టి మంత్రములు చెప్పే ఋత్విక్కులు చిక్కటం చాలా అదృష్టం. ఇటువంటి ఋత్విక్కులచేత ఇక్కడ యజ్ఞము చెయించినందుకు అనేకమంది చాలా ఆనందిస్తున్నారు. ఇదేవిధముగనే దసరా సందర్భంలో పుట్టపర్తిలో మరొక యజ్ఞము జరుగనున్నది. ప్రతి దసరాకు చేసే యజ్ఞము జ్ఞానయజ్ఞము. జ్ఞానయజ్ఞము మానసిక తత్త్వానికి సంబంధించినది.

ఋత్విక్కులారా! రేపటి దినము మీరు శ్రమపడినందులకు మీకెంతో ఫలితమున్నది. ఈ ఫలితము మీకిప్పుడు తెలియదు. మీరు మీమీ స్వస్థానములకు వెళ్ళిన తరువాత విచారించండి, తప్పక ఆనందము మీకు అనుభవంలోకి వస్తుంది. మన ఋత్విక్కులలో చాలామంది యువకులున్నారు. వీరంతాచేరి ఈవిధమైన పవిత్ర కార్యంలో పాల్గొనటం చాలా అదృష్టం. 'ఇలాంటి ఋత్విక్కులు చిక్కటం చాలా అదృష్టమయ్యా' అని వినయ్‌కి చెప్పాను. కాని, మీకిక్కడ అనుకూలంగా జరిగిందో లేదో! భోజన, వసతి సదుపాయములు మీకు తగిన రీతిగా ఉన్నవో లేవో! మీకు వినయ్ సరియైన అనుకూలములు చేస్తున్నాడో లేదో... నేను ప్రొద్దున్ననుండి సాయంకాలము వరకు ఇదే యోచిస్తుంటాను. మీరు సంతోషంగా ఉంటే, నాకు అదే సంతోషము. పది దినములుకూడను పది నిమిషములుగా గడచిపోయినవి. ఈ పది దినములుకూడను మీరెంతో ఆనందించారు. నేనూ ఎంతో ఆనందించాను. మీరెక్కడికి వెళ్ళినప్పటికీ ఈ దృశ్యాన్ని మీరు మనస్సులో తల్చుకుంటూ ఉండాలి. ఈ పవిత్రమైన అనుభవాన్ని ఎన్నడూ మరువకూడదు. త్వరలోనే మీరు మళ్ళా పుట్టపర్తి వచ్చి చేరతారు. ఇంతియేకాక, అతిత్వరలోనే మద్రాసులో ఈ యజ్ఞము జరపాలని

సంకల్పించుకున్నాను. మీరందరూ రావాలని నేను ఆశిస్తున్నాను. ముఖ్యంగా యజ్ఞముయొక్క విశిష్టతను మీరు గుర్తించాలి. యజ్ఞమనగా భౌతికమైనదా, లేక ఆధ్యాత్మికమైనదా? ఇది ఆధ్యాత్మికమైన యజ్ఞమేగాని, భౌతికమైన, లౌకికమైన యజ్ఞము కాదు. మానసికంగా, శారీరకంగా, హృదయపూర్వకంగా అనుభవించినటువంటిది ఈ యజ్ఞము.

మీరు ఎలాంటి పంచెలు ధరించాలి అనే విషయం దగ్గరనుంచి ప్రతి ఒక్కటీ నేను స్వయంగా విచారిస్తూ, పనిచేస్తూ వచ్చాను. ఇంట్లో పిల్లల బాగోగులను తండ్రి ఏవిధంగా చూసుకుంటాడో ఆవిధంగా మీకు కావలసినవన్నీ నేను సమకూరుస్తూ వచ్చాను. రేపటి కార్యక్రమం తరువాత మిమ్మల్ని ఇక్కడినుండి పంపాలంటే నాకు చాలా కష్టంగా ఉంటున్నది. మీకూ ఇక్కడనుండి పోవటం చాలా కష్టంగా ఉంటున్నది. ఈవిధమైన సన్నిహితసంబంధ బాంధవ్యమే నిజమైన భక్తి. నన్ను విడచి వెళ్ళటం మీకు కష్టం. మిమ్మల్ని విడిచిపెట్టటం నాకు కష్టం. నేనెప్పుడూ మీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉన్నాను. కనుక, 'స్వామి ఎక్కడో పుట్టపర్తిలోనో, బెంగుళూరులోనో ఉన్నాడు. మేము స్వామికి దూరంగా ఉన్నాము' అని మీరేమాత్రము భావించకండి. నేను మీవెంటనే ఉన్నాను. మన ప్రధాన అర్చకుడు చాలా భక్తిగా, శ్రద్ధగా కార్యక్రమాలను జరిపించాడు. తన స్వంతపనిగా భావించి చేశాడు. ఆవిధంగా భావించి చేసేవారు లోకంలో చాలా అరుదు.

ముఖ్యముగా మీరు త్యాగాన్ని బోధించాలి. మానవునికి ఎన్నయో ఆశలుంటాయి. ఈ ఆశలన్నింటిని క్రమక్రమేణా దైవ ప్రీత్యర్థం అర్పితం గావించాలి. కేవలం స్వార్థం మాత్రమే చూసుకోకండి. పరోపకారం చాలా మంచిది. ఏది చేసినా 'మా హృదయతృప్తికై మేము ఆచరిస్తున్నాము' అని మీరు భావించాలి. ఈ యజ్ఞము ఆత్మ తత్త్వమును అర్థం చేసుకునే నిమిత్తమై టేసినటువంటి యజ్ఞమేగాని, ఏదో ప్రాపంచికంగా, లౌకికంగా, భౌతకంగా ఆచరించినటువంటి యజ్ఞము కాదు. మీ క్షేమం కోసం, మీ మంచి కోసం, లోకకల్యాణం కొరకు మీరీ పవిత్రమైన యజ్ఞంలో పాల్గొన్నారు. ఇది కేవలం మీకోసం కాదు, యావత్ప్రపంచమునకు సంబంధించినటువంటిది. మీరు చెప్పిన మంత్రములన్నీ గాలిలో చేరి సర్వత్రా వ్యాపించిపోయినవి. ఈ పవిత్రమైన శబ్దములు మన హృదయాలలో చేరి పవిత్రతను చేకూర్చుతాయి. కనుక, మనం చెప్పినటువంటి మంత్రములు ఏదో ఇక్కడికి మాత్రమే పరిమితమయ్యాయని అనుకోవద్దు. అవి ప్రపంచమంతటా వ్యాపించిపోయినాయి. కేవలం మన ఇండియాకు మాత్రమే కాదు, అన్ని దేశములుకూడను ఇది సంబంధించినటువంటిది. భాషల్లో వ్యత్యాసముండవచ్చును. కాని, భావములో ఎట్టి వ్యత్యాసమూ ఉండదు. అమెరికన్స్, రష్యన్స్, ఆఫ్రికన్స్ మొదలైన వారందరూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారుకూడను వేదమంత్రాలను నేర్చుకుంటున్నారు. పోయిన నెల 26వ తేదీ 80మంది జర్మన్లు స్పెషలె ప్లేనులో పుట్టపర్తికి వచ్చారు. వారందరూకూడ వేదమంత్రాలను పఠించారు. 'ఈ మంత్రములే మా దేశాన్ని రక్షిస్తున్నాయి. కనుకనే, మేము తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండినంతవరకు ఈ మంత్రములను చెబుతుంటాము' అన్నారు.

ఈ మంత్రోచ్చారణలో స్వార్థమనేది ఎక్కడా లేదు. అందరికీ సంబంధించినదిగా ఉంటుంది. ప్రతి మానవునికి ఈ మంత్రములు చాలా అవసరము. ఇది కేవలం వ్యష్టికి కాదు, సమష్టిస్వరూపానికి సంబంధినిచినవి. సమాజమునకు , దేశమునకు అందరికీ సంబంధించినవి, ఈ మంత్రములు. ఈనాడు పాశ్చాత్యులుకూడా వీటిని ప్రింటుచేసుకుంటున్నారు. ఈ మంత్రములను మనం ప్రపంచానికంతటికీ పంచాలి. విదేశీయులకు ఈ మంత్రములను ఉచ్చరించటం కష్టమే. ఎందుకంటే, వారి నాలుకలు తిరగటం చాలా కష్టం. కాని, ఎట్లయినా సరే, పట్టుపట్టి నేర్చుకుంటున్నారు. మానవుడు పట్టుపడితే ఏదైనా సాధించగలడు.

పట్టినదేదియో పట్టనే పట్టితి
    పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితి
    కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితి
    వడిగినదిడుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితి
    తలపు తీరెడుదాక తరలకుండు

పోరు పడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నీవైన అడుగవలయు
అంతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగి పోవుట భక్తుని దీక్షకాదు.

కనుక, మనము పట్టిన దానిని సాధిస్తూ రావాలి. ఈ అతిరుద్రమహాయజ్ఞమనేది మున్ముందు చాలా జరపాలి. ఇది అందరికీ సంబంధించినది. ఒక కులానికో, ఒక మతానికో, ఒక దేశానికో సంబంధించినదికాదు. ఇది ప్రపంచమంతటికీ సంబంధించినటువంటిది. ఈ యజ్ఞమును మీరు చేస్తూ చేస్తూ ఉంటే ప్రపంచమంతా అతి త్వరలోనే అందరూ యేకమైపోతారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, జపాన్, అమెరికా, జర్మనీ అన్నీ ఏకమైపోతాయి. ఇప్పుడు అమెరికాలో చాలా గొప్ప భక్తులున్నారు. అక్కడ చాలామంది ఋత్విక్కులు కూడా ఉన్నారు. మహమ్మదీయులు కూడా ఉన్నారు. ఒకామె స్వామి గురించి ఒక పుస్తకం వ్రాసింది. ఆ పుస్తకాన్ని తీసుకువెళ్ళి అమెరికాలోనున్న తన గురువుకు ఇచ్చింది. అతను దీనిని చూసి కంటిధారలు కార్చాడు. 'ఇంత అదృష్టము నాకుకూడా కలగాలి' అని ప్రార్థించాడు. ఇప్పుడా పుస్తకాన్ని ప్రింటు చేసి అక్కడ అందరికీ అందిస్తున్నారు.

మనము దేశాన్నంతటినీ ఏకం చేయాలి. భిన్నత్వంలో ఏకత్వం దర్శించాలి. చూడండి, మన భారతదేశంలోనే ఎన్ని విధములైన భేదాలు కలుగుతున్నాయి! ఇంతకుముందు ఒక్కటిగా ఉన్న మద్రాసు స్టేటు రెండుగా మారిపోయింది. తమిళనాడు, ఆంధ్ర. అంతేకాదు, మరికొన్ని క్రొత్త రాష్ట్రాలకొరకు ఆందోళన మొదలైంది. ఈవిధంగా ముక్కలు ముక్కలు చేయటం గొప్పతనం కాదు. ఒక్కటిగా చేర్చటం చాలా గొప్పతనం. యూనిటీ ఎక్కడుంటుందో అక్కడే ప్యూరిటీ ఉంటుంది. ప్యూరిటీ ఎక్కడ ఉండునో అక్కడే డివినిటీ ఉంటుంది. కనుక, మనం యూనిటీకి తగిన ప్రయత్నం చేయాలి. నిన్న వేదం పఠించిన పిల్లల్లో రష్యన్ ఉన్నాడు., అమెరికన్లు ఉన్నారు. ఇరాన్ పిల్లవాడుకూడా ఉన్నాడు. ఈవిధమైన ఏకత్వాన్ని మీరు గుర్తించి దీనిని అభివృద్ధి పరచాలి. మీ అందరియందు అంతో ఇంతో భేదబుద్ధి ఉంటే దానిని తక్షణమే తీసి పారవేయండి. ఏకంగా ఉండండి. అందరూ బ్రదర్స్ అండ్ సిస్టర్స్‌గా కలసిమెలసి మెలగాలి. అప్పుడే మీకు తగినటువంటి విలువ కలుగుతుంది.

(అతిరుద్రమహాయజ్ఞ సందర్భంగా సాయికుల్వంత్‌లో 19 ఆగష్టు2006 భగవాన్ బాబావారిచ్చిన దివ్యోపన్యాసం)